# కాలుష్యం

''తోలు బొమ్మలాట ఆడితే వర్షం కురవడం ఏమిటి? అబ్సర్డ్ '' అంటున్నాడు రోడ్డు మీద గుంపులో వున్న వేసవి సెలవుల కుర్రాడు.

అప్రయత్నంగానే అయినా వాళ్ళ మాటలన్నీ నా చెవుల్లో పడుతూనే వున్నాయి. నిజమే. ఆ రెండింటికీ సంబంధం ఏమిటి?

ఈ ఊళ్ళో ఎంత మార్పు?

నాగరికతకు దూరంగా ఈ కొండల మధ్య చుట్టూ చుట్టు ముట్టినట్టు వున్న అరణ్యాలమధ్య వున్న లోతట్టు మన్య ప్రాంతంలోని ఈ పల్లెటూరు -

ఈ ఊళ్ళో ఎంత మార్పో?

ఈ మార్పుని మూడేసి నెలలకి ఒకసారి చొప్పున ఏళ్ళ తరబడి చూస్తూనే వున్నాను.

ఈ పల్లెటూరి ఇళ్ళ గోడలన్నీ సంక్రాంతి తర్వాత మళ్ళీ సంక్రాంతి దాకా వెల్ల కోసమే వేచి, నిలిచి వుండేవి. అలాంటి ఈ గోడల మీద మొదటి సినిమా పోస్టర్ అంటించిన రోజు నాకు తెలియదు.

సెలవుల కోసం ఎదురు చూసే నేను రెక్కలు కట్టుకుని ఇక్కడ వాలినప్పుడు గోడలన్నీ సినిమా బొమ్మలతో నగ్నంగా అనిపించాయి.

జట్లు జట్లుగా, జట్లు కట్టుకుని ఐదేసి మైళ్ళు పోయి వస్తూ సినిమా వెర్రిలో పడిన జనంలో ఈ నా బాధకి ఓదార్పు ఎక్కణ్నించి వస్తుంది?

అలాగే ఈ కుర్రాడి అనుమానానికి మాత్రం నివృత్తి ఎలా?

రామ కోవెల లోంచి చప్పుళ్ళు. బెంచీల మీద ఎగురుతున్న చప్పుడు. ఆ చప్పుళ్ళ మధ్య నించి లీలగా హార్మోనియంతో బాటు కీచుమని వస్తున్న పాటో పద్యమో తెలీకుండా అపస్వరాలతో నాకు సగం నిద్రలో వినిపించి మెలుకువ తెప్పించేసాయి. రోడ్డుకి అవతల రామకోవెల పందిట్లో తోలు బొమ్మలాట జరుగుతోందని తెలిసేసరికి నాకు పూర్తిగా మెలుకువ వచ్చేసింది.

టైం చూసేను. ఆకాశం నిండా ఎన్ని చుక్కలో! ఈ చుక్కలు ఇంత విరజిమ్మినట్టు ఈ టైంలోనే వుంటాయి.

లేచి, నెమ్మదిగా కంచె తలుపు విప్పుకుని ఆ పందిట్లోకి వెళ్ళాను. ఒక్కసారిగా ఎంతో దిగులేసి అది దుఃఖమైంది.

తెరముందు పందిట్లో ముగ్గురో, నలుగురో ప్రేక్షకులు.

ఈ నలుగురి కోసమూ అతి ప్రయాసతో ఇంత తెల్లవారు ఝామువరకూ ఇలా ఈతముళ్ళు

గుచ్చిన బొమ్మల్ని ఆడిస్తున్నారా వీళ్ళు?

'అసలు జనం' కన్పించకుండా బొమ్మలు అడ్డున్నాయా వీళ్ళకి, ఇంకా ఎప్పటికి ఈ విరాట పర్వం పూర్తి అవుతుంది? ఈలోగా తెల్లవారిపోదా?

ఇవి ఉత్త తోలుబొమ్మలయిపోవా?

★ ★ ★

తెల్లవారి చాలా పొద్దెక్కాక కానీ మెలకువ రాలేదు నాకు. ఎండ ఫెళ్ళుమని కొడుతున్నట్టు వుంది. టైం చూస్తే తప్ప తొమ్మిదే అయింది అనిపించడం లేదు.

పెరట్లోంచి కేకలు వినిపిస్తుంటే వెళ్ళేను. అమ్మ అరుస్తోంది ఎవరో పిల్లమీద. ఆ పిల్ల నిర్లక్ష్యంగా మొహం ఆ వేపుకి తిప్పుకుని నించుని వుంది.

''ఏవిటమ్మా ఆ అరుపులు? నెమ్మదిగా చెప్పకూడదూ?'' అన్నాను ఆ పిల్లనే చూస్తూ– పనిపిల్లను కసిరి నట్టు కసురుతోందని. ఎవరి పిల్లో?

''చూడరా! దీని దర్జా. అంట్లు తోమడానికి రిన్ సబ్బు కావాలిట దీనికి. పొయిలో వెలి బూడిద వుంది తోమవే అంటే తోమదట. ఎప్పుడైనా ఎరుగుదుమా ఇలాగ?''

ఇంకా ఏదో చెప్తోంది. నేను పరీక్షగా చూశానిప్పుడు . ఇది నిజంగా పనిపిల్లేనా? నాకు ఆశ్చర్యం వేసింది. దాని డ్రెస్, జుట్టుని అది మడిచిన తీరు, మెడలో వేసుకున్న నాజూకయిన పూసల దండ, వీటన్నింటినీ మించిన దాని కదలికలో, చూపులో కనిపిస్తున్న ఒక విలాసం, నిర్లక్ష్యం.

చటుక్కున ఆగింది చూపు, మనసు. అవును ఇలాంటి విలాసవంతమయిన నిర్లక్ష్యం, ఇదే చూపు అవును ఎక్కడ చూసేను– నేను?

''ఎవరమ్మా ఈ పిల్ల? అన్నాను.''

'' అయ్యో! నీకు తెలీదూ! మనింట్లో పనిచేసేది సీతమ్మ దాని కూతురు చిన్ని–చిన్నమ్మి. దీని అమ్మ మంచం మీంచి లేవడం లేదు. అది దీన్ని పనిలోకి పంపితే ఇదీ దీని వరస'' అని సణుక్కుంటూ లోపలికి వెళ్ళిపోయింది.

చిన్ని–చిన్నమ్మి చేతులు చూసుకుంటూ నించుంది.

''ఏమే! వెలి బూడిదతో తోమి గిన్నెలు కడిగి ఎండలో బోర్లించి మెరిపించేది మీ అమ్మ. నీకు తెలీదా?'' అన్నాను. అది మాట్లాడలేదు. దగ్గిరికి వచ్చి చేతులు చూపించింది. చూపించి.

''చూడండయ్యా ఈ సేతులు. యియి బండగా అయిపోవూ అలా తోమితే. ఇలా తోమితేనే మాయమ్మ సేతులు ఆకురాయిల్లాగ అయిపోయేయి'' అంది.

నాకు చెప్పలేనంత ఆశ్చర్యం కలిగింది.

అంట్లు తోమిన సీతమ్మ చేతిలో లెంపకాయ తిన్న వాళ్ళు జీవితంలో కొన్ని విషయాల్లో చాలా జాగ్రత్తగా వుంటారు. ఈ మాట సరదాగా అక్కతో అంటుండే వాణ్ణి.

ఈ మాటే చిన్నితో అన్నాను. అంటే అంది కదా.

''సెంప దెబ్బ కోట్టే అవుసరం నాకేం వుంది సిన్నబాబూ! ఎవడైనా సరదాపడి సెయ్యట్టు కుంటే ఆడి సరదాని కాదంటే కదా?''

నాకు మాట పడిపోయింది. ఇలాంటి మాటలు దాని నోట్లోంచి ఊహించలేదు నేను. సీతమ్మ కూతురా ఇది? ఎలాంటి సీతమ్మ? ఏ సీతమ్మ?

ఈ ఇంట్లో ఎన్నో ఏళ్ళుగా పని చేస్తున్న సీతమ్మేనా? వాకిలంతా అద్దంలా ఊడ్చి, నీళ్ళు చల్లి, నున్నటి అరుగులా చేసేసిన సీతమ్మేనా?

ఆ అరుగులు అలికిన చేతితో కొట్టిన చెంపదెబ్బలకి జనం అదిరిపోయి రాక్షసి అని పిలిచే సీతమ్మేనా? నాకిప్పుడు గుర్తొస్తోంది.

ఇది సీతమ్మ కూతురు కాదు. ఎందుకు కాదంటే రాక్షసి సీతమ్మ చెంపదెబ్బ కొట్టకుండా కరిగిపోయి లొంగిపోయినదెవరికో ఆ బేంబూ సూపర్‌వైజర్, వాడి కూతురు – ఈ చిన్ని–

★ ★ ★

అవును. అప్పుడు నేను చిన్నవాణ్ణి.

''సుందరాంగ మరువగలేనోయి రావేలా...'' అని కూనిరాగం తీస్తూ పని చేసుకునేది సీతమ్మ.

వాకిలి ఊడుస్తూ, అంట్లు తోముతూ అదే పాట.

''ఎక్కడ విన్నావే ఈ పాట నువ్వు '' అని అక్క అడిగేది. అంతే పాట టక్కున ఆపేసి, నవ్వేసేది.

ఆసూపర్ వైజర్ ఇంట్లో పనికి కుదిరేక– తర్వాత తర్వాత ఆ పాట పాడింది కాదు.

సీతమ్మలోని మార్పు స్పష్టంగా, ఎత్తుగా ఎదిగిన దాకా ఎవరూ గుర్తించలేదు అది పాడుకోవడం మానెయ్యడం.

అక్క చిన్నగా వేళాకోళం చేసేది. ఏమే! నీ సుందరాంగుడు వచ్చేసేడనా? మానేసేవు అని. అలాంటప్పుడు దాని మొహంలో చిరునవ్వు స్థానంలో భయమూ, దిగులు కనిపించేవి.

★ ★ ★

ఒకనాడు వీధి అరుగు మీద కూర్చుని నేను ఏదో రాసుకుంటున్నాను. ఇంతలో నాన్నగారూ, అతనూ లోపలికి వచ్చేరు. అతను.... ''నాకు చాలా పట్టుదలొచ్చిందండీ! మాటంటే మాటే. ఇంక ఒక్క క్షణం వుండను ఈ ఉద్యోగంలో. ఇదిగో రిజిగ్నేషన్ కూడా రాసేసేను. చూడండీ'' అని జేబులోంచి తీసి చూపించేడు ఆనాడు.

''తొందర మంచిది కాదు. కొంచెం ఆలోచించండి'' అంటున్న నాన్నగారి మాటకూడా వినకపోవడం ఇప్పుడు గుర్తొస్తోంది నాకు.

విలాసపు కదలికలు, చూపుల్లో నిర్లక్ష్యం, ఒక విలక్షణమైన అందం- అలా మాట పట్టింపుతో ఆనాడు ఉద్యోగం వదిలి వెళ్ళిపోవడం.

మనసుని కూడా పట్టించుకోకుండా సీతమ్మను కూడా వదిలి.

ఆ చిన్నేనా? ఈ చిన్ని-?!!

★ ★ ★

చాలా దిగులుగా వుంది. దుఃఖంగా వుంది. ఈ దుఃఖానికి కారణం ఎవరికి చెప్పుకోను?

మధ్యాహ్నం అలా నడుచుకుంటూ పరద్యానంగా సీతమ్మ పాక ముందు కెళ్ళేను. పరధ్యానంగా కాదు – అదే ధ్యాసతో.

అరుగు మీద నులకమంచంలో చిక్కి శల్యమైపడివుంది. తలవంచి చూరు కింద నుంచి పాకలో అరుగెక్కేను.

''ఎవరు బాబూ?'' అంది.

''నేనే సీతమ్మా! చిన్నబాబుని''

''ఎప్పుడొచ్చేవు నాయనా? నన్ను సూడ్డానికొచ్చేవా?

నా తండ్రీ!'' అని లేవబోయింది.

''వద్దు లేవకు సీతమ్మా! పడుకో'' అని నెమ్మదిగా పడుకోబెట్టి చెప్పేను.

''రెండు రోజులయింది సీతమ్మా వచ్చి. అమ్మ ఈ రోజే చెప్పింది నువ్వు లేవడం లేదని. చూసిపోదామని వచ్చేను'' అన్నాను.

''ఏం సెయ్యను బాబూ? నేను రాకపోతే ఆయమ్మ కెంత కట్టవో నాకు తెలుసు ఆయమ్మకీ సెయ్యి ఇరుసుకున్నట్టుంటాది. ఏం సెయ్యను తండ్రీ!''

''ఫర్వాలేదు సీతమ్మా! రెండు రోజులకేమైందని? నువ్వు విశ్రాంతిగా పడుకో'' అన్నాను.

''నాకు ఓపికగా వుండి పని సేసుకుంటేనే సుకంగా వుంటాది సినబాబూ! పని లేకుండా ఇలా పడుకుని వుంటే ఏదో సెప్పలేని బెంగకింద వుంటాది'' అని..

''సిన్నమ్మిని సూసేవా బాబూ, దాని పద్ధతి అంతా అలాగ వచ్చేసింది. ఎలా బతుకుద్దో? ఏటో?'' అంటుటే సీతమ్మ కళ్ళల్లో నీళ్ళు తిరిగేయి.

దాని మీద బెంగే నన్నిలా తినేస్తోంది అని ఆ కన్నీళ్ళు చెప్తున్నట్టు అనిపించింది నాకు.

''మా కెవరు దిక్కు బాబూ? ఇన్నాళ్ళూ నాకా బెంగ వుండేది కాదు. నా రెక్కలు, నా కట్టమే నా దిక్కు అనుకునేదాన్ని. ఎంత ధైర్యంతో బతికేను? ఇప్పుడు దానికి ఆ ధైర్యం ఇవ్వలేక పోతున్నాను. నేను పోతే దాని బతుకెలాగో?''

సీతమ్మకున్న దిక్కూ, ధైర్యమూ చిన్నమ్మికి ఎలా వస్తాయి?

''నీకా బెంగేమీ వద్దు. నువ్వెలా పెరిగేవో అలాగే చిన్ని మనింట్లో పెరుగుతుంది'' అని నచ్చ చెప్పి వచ్చేశాను. అలా చిన్ని మా ఇంట్లో పెరగగలదా?

అది సంభవం కాదని నా కెంత స్పష్టంగా నిన్నా, ఈ వేళ్టిలో తెలిసిందో అంత కంటే ఎన్నో రెట్లు ఎక్కువగా దాని తల్లికి తెలిసివుండదా?

★ ★ ★

బైట ఎండ తీవ్రత లోపల గదిలో కూడా నిలవ నివ్వడంలేదు నా మనస్థితిలాగే.

అస్థిమితంగా పడక్కుర్చీలో పడుకుని మార్క్స్‌ని చదవడానికి వ్యర్థ ప్రయత్నం చేస్తున్నాను.

లక్ష్య గ్రంథాలు ముందు పుట్టేక, వాటి కోసం శాస్త్రాలు పుడతాయట. మానవ జీవితాలే లక్ష్యాలుగా వ్రాసిన ఈ సిద్ధాంత గ్రంథంలో ఏదీ నా బుర్రకి ఎక్కడం లేదు.

ఈ ఊళ్ళో పుట్టి, ఇక్కడి ఆడి పాడి, ఇక్కడే పెరిగి పట్నాల్లో చదువుకోసం వున్నప్పుడు కూడా మనసుతో ఇక్కడే జీవించి ఎన్ని రకాల దోపిడీలు చూడలేదు నేను?!!

ఆ దోపిడీల తాలూకు జ్ఞాపకాలు మనసుని, మనిషిని అచేతనంగా చేసిననాడు ఈ మార్క్స్ ఎంత చైతన్యాన్ని ఇచ్చేడు నాకు – నా దుఃఖంలోంచి నాకు ఎంత ఊరట కలిగింది.

అలా పుస్తకం చూస్తూనే ఆలోచనల్లో వున్న నేను ఉలిక్కిపడేలా తలుపు తోసుకుని చీపురు కట్టతో లోపలికి వచ్చింది చిన్నమ్మి.

సీతమ్మ బైటనించే ''సినబాబూ'' అని సన్నగా పిలిచి లోపలికి వచ్చేది.

''ఇప్పుడేం తుడుపే మిట్ట మధ్యాహ్నం'' అన్నాను ఆశ్చర్యంగా.

''ఈ రోజు సినిమాకి పోతున్నాం. ఎప్పుడు సేసినా ఇదే పని కదా! సేసేస్తే అయిపోతాది'' అని నిమిషంలో తుడిచిపారేసి పోయింది.

ప్రతీ క్షణం ఈ అమ్మాయితో సీతమ్మని పోల్చాలని ఎందుకు అనిపిస్తోంది నాకు? కుంచెతో పెయింట్ చేస్తున్నట్టు గదులు తుడిచి సర్దివెళ్ళేది అది. అసలు దానికి కూతురుగా పుట్టడమొక్కటే దీని పుణ్యం. ఎందులోను పోలిక లేదు.

మార్క్స్‌ని మూసేసేను.

స్వచ్ఛంగా, బలంగా పూసిన ఈ అడివి పూల మీద నాగరికత చల్లిన బురద వాటి స్వచ్ఛతని, బలాన్నీ కూడా పోగొట్టడం – ఎదుర్కోవచ్చు.

కానీ వాటి జీన్స్ లోకే కాలుష్యాన్ని చేర్చిందే?

ఈ దిగులు మార్క్స్‌కి ఏమని చెప్పను? ఎలా ఊరట పొందను??

★ ★ ★

అయినా వర్షం పడలేదు.

ఎలా పడుతుంది? అసలు దానికీ, దీనికి ఏమిటి సంబంధం? ఆ కుర్రాడి మాటలే మనసులో మెదులుతున్నాయి.

వర్షం!! అందునా ఇంత తీవ్రమయిన గ్రీష్మంతంలో ఒక సాయంత్రం మబ్బులు పట్టి వర్షం పడితే ఎంత భాగ్యం? అలాంటి, వర్షానుభవం కోసం ఎంత పుణ్యం చేసుకోవాలి? ఈ సాయంత్రం

పిచ్చిగా ఆ చిన్ని పూరిగుడిసెల ఊరంతా తిరిగేను. సాయంత్రం దాటి చీకటి పడుతోంది. గుడిసెలన్నీ. చాలా వరకూ నిర్మానుష్యంగా వున్నాయి. తురాయి పూలతో అలంకరించుకునే ఈ అడవి పడుచులు తలలో వాడి, మాగిన లిల్లీ పూలతో - అర్ధరాత్రి దాటేక సినిమా కబుర్ల మధ్య అయిదు మైళ్ళు నడిచి వచ్చి ఈ గుడిసెలలో దీపాలు వెలిగించుకునే దాకా ఈ చీకటి ఎలా పోతుంది?

ఎంతో ప్రాణమయిన ఈ ఊళ్లో ఇంక నిలవలేననిపిస్తోంది. ఎక్కడికో పోయి ఏమో చెప్పుకోవాలనిపిస్తోంది.

పోయి - ఎవరికి - ఏమని చెప్పును?

మా ఊళ్ళో వర్షం లేదనా?

మా ఊరి గోడలన్నీ సినిమా పోస్టర్లతో ఖరాబయ్యేయనా?

ఏమని?

★ ★ ★

''సీతమ్మా'' ఆ నులకమంచం అంచున కూచుని తట్టి లేపేను. నీరసమో, మగతో తెలీకుండా పడివుంది. రెండు, మూడు సార్లు పిలిచేను.

నెమ్మదిగా కళ్ళు తెరిచింది. ఆ కళ్ళ నిండా ఎంత వెలుగో, ఎంత నైర్మల్యమో, అంత దిగులు. నాకేసి నిదానంగా చూసింది.

సుందరాంగ మరువగ లేనోయి రావేలా

నా అంద చందములు దాచితి నీకై రావేలా

ఆమె మనసొక్కటే మౌనంగా ఈ పాట పాడుకుంటున్నట్టున్నాయి కళ్ళు . ఆ పాట ఆమె ఎంత మౌనంతో పాడినా జాలితో, దుఃఖంతో పాడుకుంటున్నట్టు వినిపిస్తోంది నాకు.

నిజమే! అందచందాలే ఇవ్వగలిగింది చిన్నికి . ఇంకేమీ ఇవ్వలేకపోయింది. అందచందాలు ఇంత జాగ్రత్తగా దాచింది. ఆ సూపర్‌వైజర్ ఎప్పుడైనా వస్తాడా? ఏ అందచందాల కోసం ఇంతపని చేసేడో వాడు!!

''సీతమ్మా! నేను ఊరు వెడుతున్నాను. నువ్వు ధైర్యంగా వుండు. చిన్ని మన ఇంట్లో పిల్ల. దానికి ఏ లోటూ రాదు'' అన్నాను.

సీతమ్మ చిన్న నవ్వు నవ్వింది.

నా వళ్ళంతా భయంతో వణికింది ఆనవ్వుకి,

''అది మనింటికాడ వుండదు బాబూ, దాని సంగతి నాకు తెల్సు. నువ్వు వెళ్ళిరా నాయనా! మీ అమ్మ నిన్ను కడుపున కనిపెంచిది. నేను కళ్ళతో కనిపెంచేను. చివరి చూపుకి రా నాయనా'' అంది.

లేచి వచ్చేశాను. దుఃఖ భారంతో వచ్చేశాను.

ఈ ఊళ్ళో వర్షాలు పడతాయా?

తోలుబొమ్మలాట వాళ్ళకి తిండి లేదు. అయినా తెల్లవార్లూ ఆట ఆడేరు. ఆట చూసే జనం రెండో ఆట సినిమా చూసివచ్చి పడుకున్నారు.

ఈజనంలో బలము, జీవము వున్ననాడు ఉత్త తోలుబొమ్మల్లో గొప్ప రసావేశాన్ని చూసి మైమరచి పోయేవారు. ఊరు ఊరంతా తెల్లవార్లూ ఆట చూస్తూ కూర్చునేది. ఈ రోజు బైట ప్రపంచపు కుహనా నాగరికత వెదజల్లుతున్న విషం వీళ్ళ రక్తమాంసాలలోకి ఇంకిపోయి, ఉత్త తోలుబొమ్మల్ని చేసేసింది.

చిన్ని ఇలాంటి తరానికి ప్రతీకా? అన్న ప్రశ్న నన్నింత దుఃఖింపచేస్తోంది.

నాకు తెలుసు. సీతమ్మకి తెలుసు.అందచందాలే దాచుకోగలిగేనని మౌనంగా దుఃఖించే ఆమెలాంటి దుఃఖితులకి తెలుసు ఈ జరిగిన దోపిడి ఏమిటో.

శ్రమశక్తిని దోచుకోవడం కంటే, శ్రమించగలిగే శక్తినే దోచుకోవడం, పోగొట్టడం ఎంత దుర్మార్గం..?!

నిసర్గమైన శ్రమ సౌందర్యం నిండిన వీళ్ళ రక్తంలోకి ఏ విలువలూ లేని ఈ విలాసవంతమైన పొల్యూషన్ రావడం, ఎంత దయనీయం?

ఇంతింత దోపిడి జరిగాక ఇక్కడ ఏం వుందని ఇంకా వర్షాలు పడతాయి? ఒక వేళ కురిసినా ఈ సారవిహీనమైన నేల లో ఏ పంటలు పండుతాయి?

సాయంత్రం బస్ కోసం రోడ్ మీద కొచ్చేను. తోలుబొమ్మలాటవాళ్ళు బొమ్మలన్నింటిని పెట్టెల్లో సర్దుకుంటున్నారు.

''ఏమోయ్ వెళ్ళిపోతున్నారా? '' అని పలకరించేను.

''అవును బాబూ! మా పిల్లలకీయాటలు ఇట్టంలేదయ్యా. నేను పోయిదాకా నయినా ఆడదాం అని నాపట్టు. నేను పోతే ఈ ఇగ్రహాలన్నీ సెల్లాసెదురే'' అంటున్నాడు. అతను బొమ్మల్నివిగ్రహాలు అంటున్నాడు. అంత గౌరవమన్నమాట వృత్తిమీద. నిజమే, నాకు అతనికీ ఒకరితో ఒకరికి ఓదార్పు.

ఇంతలో బస్ వచ్చింది.

చెల్లాచెదురు కాకుండా ఏం చెయ్యాలి!?